క్లుప్తంగా

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



కారెంపూడి: మండల అధికారులు శనివారం కారెంపూడిలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. స్టాకు రిజిస్టర్లు, ఈ– పాస్ బ్యాలెన్స్‌లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఏఓ నరసింహారావు, ఎస్‌ఐ వాసు పాల్గొన్నారు.

పత్తి చేలల్లో సస్యరక్షణ చేపట్టాలి



మాచర్ల రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి చేలల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహా, సాంకేతిక కేంద్రాల వ్యవసాయ శాస్త్రవేత్త ఎం. నగేష్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో శనివారం పత్తి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గులాబీ రంగు పురుగును నియంత్రించడానికి పెరమోస్ ట్రాప్స్ ఎకరానికి 20 చొప్పున పెట్టుకోవాలని తెలిపారు. తెల్ల దోమ నివారణకు లీటర్ నీటికి డైఫెన్తురియాన్ 1.25 గ్రాములు, పచ్చ దోమ నివారణకు లీటరు నీటికి ఫిప్రెనోపాస్ 2.5ఎం.ఎల్. కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం. మార్కండేయులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎస్. వెంకటేశ్వర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని యువకుని మృతి

కారెంపూడి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని దాచేపల్లి వెళ్లే రోడ్డులో బ్రహ్మానాయుడు కాలనీ వేపకంపల్లి రోడ్డు మధ్య శనివారం చోటు చేసుకుంది. బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన జరపల రామాంజనేయ నాయక్ పని నిమిత్తం దాచేపల్లి వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తున్నారు. ఈ సమయంలో ఎదురుగా కారెంపూడి వైపు నుంచి వెళ్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హాస్పిటల్‌కు తరలిస్తుండగానే రామాంజనేయ నాయక్ (26) మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.మరో వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం.

మందు బాబులు ముగ్గురిపై కేసు నమోదు

లక్ష్మీపురం: బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు. చుట్టుగుంట, కె.వి.పి కాలనీ వీఐపీ రోడ్డులో శనివారం రాత్రి నగరంపాలెం పోలీసులు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ముగ్గురు బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగి అసభ్యకరంగా ప్రవర్తించినా, గంజాయి, మత్తు పదార్థాలు తీసుకుని దుర్భాషలాడినా, స్థానికులను ఇబ్బందులకు గురి చేసినా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని నగరంపాలెం సీఐ నజీర్ బేగ్ కోరారు.

స.హ.చట్టం సామాన్యుల చేతిలో ఆయుధం

నకరికల్లు: సమాచార హక్కు చట్టం సామాన్యుల చేతుల్లో ఆయుధం లాంటిదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ముజావర్ జాన్‌అహ్మద్ అన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నకరికల్లు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌అహ్మద్ మాట్లాడుతూ 2005లో అమల్లోకి వచ్చిన సమాచార హక్కుచట్టం ఎందరో సమస్యల పరిష్కారానికి దోహదపడిందన్నారు. గ్రామీణ స్థాయి ప్రజానీకానికి చట్టం ఉపయోగపడాలంటే క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. పీడిత, బాధిత ప్రజలకు అండగా నిలిచి చట్టం ద్వారా వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మండల కమిటీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటగిరి, ఉపాధ్యక్షుడు బద్దుల నాగేశ్వరరావు, కార్యదర్శి విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బి.ఎన్. రెడ్డి, ట్రెజరర్ మడకా వెంకటేశ్వర్లు, ముజావర్ వలి, షేక్ మౌలాలి, స్వర్ణ పిచ్చయ్య పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

నకరికల్లు: గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలకు, నివాస గృహాలకు శాశ్వత హక్కుపత్రాలు మంజూరు చేసేందుకు స్వామిత్వ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని డీఎల్‌డీఓ వై.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా నకరికల్లులో శనివారం చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామ మ్యాప్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమస్యల సేద్యంతో రైతులు సతమతం

- ముమ్మరంగా వరి నాట్లు
- కూలీలు, యూరియా కొరతతో రైతులకు అవస్థలు
- పెట్టుబడులకు వడ్డీ వ్యాపారులే దిక్కు



కారెంపూడిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు



వరి నాటుకు ముందు పూజ చేస్తున్న కూలీలు

కారెంపూడి: మండలంలో ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. క్రమక్రమంగా పొలాలన్నీ పచ్చదనం పరుచుకుంటున్నాయి. గ్రామాల నిండా వలస కూలీల కోలాహలం కన్పిస్తోంది. అయితే, స్థానిక కూలీలు నాట్లకు దూరంగా ఉంటుండంతో రైతులను కూలీల కొరత సమస్య వెంటాడుతూనే ఉంది. కాల్వలకు నీరు విడుదల చేయగానే పోసిన నారుమళ్లు అన్నీ ఏతకు వచ్చాయి. అన్నీ కూడా 20 నుంచి 30 రోజుల మధ్య కాల వ్యవధిలో ఉన్నాయి. రైతులంతా సకాలంలో నాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నా కూలీల కొరత వేధిస్తోంది. దీంతో నాట్లు ఆలస్యం అవుతున్నాయి. బాపట్ల, రేపల్లె, ఇతర ప్రాంతాలతో పాటు బెంగాల్ నుంచి వచ్చిన వలస కూలీలే రైతులకు ఆధారం అయ్యారు. దాదాపు నాట్లన్నీ వారే వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వినాయక చవితికి వారిలో చాలా మంది స్వగ్రామాలకు వెళ్లడానికి సమాయత్తం అవుతుండడంతో మళ్లీ నాట్లకు కొంత బ్రేక్ పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికి దాదాపు 50 శాతం మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయి. సెప్టెంబరు మొదటి వారంలోపు పూర్తవుతాయా.. లేదా? అనే సందిగ్ధం రైతుల్లో నెలకొంది. మండలంలో దాదాపు 18 వేల ఎకరాల వరి మాగాణి ఉంది. భూములను రైతులు బాగు చేసుకుని దమ్ము చేసుకుని నాట్లకు సిద్ధం చేసే పనులు మరో వైపు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో పనుల ఒత్తిడితో రైతులు బిజీగా ఉన్నారు.

యూరియా ధర డబుల్

ముఖ్యంగా యూరియా కొరత మండలంలో కనిపిస్తోంది. రూ.250కి దొరకాల్సిన బస్తా రూ.450 దాకా పలుకుతోంది. వ్యాపారులు కూడా ఎక్కువగా లేదని చెబుతున్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదు. కృత్రిమ కొరత సృష్టా లేక మరేదైనా కారణం ఉందా? అనే ఆలోచనలో రైతులు సతమతం అవుతున్నారు.

పెరిగిన పెట్టుబడులు

పెట్టుబడులు కూడా పెరగడంతో వడ్డీ వ్యాపారుల వద్ద రైతులు అప్పులు చేస్తున్నారు. ఎకరం దమ్ముకు రూ.4,800, నాటుకు రూ.5,000 ఖర్చు అవుతోంది. దీంతో పాటు గనేలు చెక్కడానికి, నారుకు అదనపు ఖర్చులు అవుతున్నాయి. సెంటు నారుకు రూ.2 వేలు వెచ్చించాల్సి వస్తోంది. తర్వాత కలుపు నివారణ, తొలి విడత బలం మందులకు మరో రూ.4 వేల దాకా కనీసం ఖర్చు అవుతోంది. ఇవన్నీ నాటు పూర్తయ్యే సరికి అవుతున్న ఖర్చులు. ఈ నేపథ్యంలో డబ్బుకు రైతులు కటకటలాడుతున్నారు.

వలస కూలీలే ఆధారం



నేను ఆరు ఎకరాల్లో వరి నాట్లు వేయించా. పూర్తయ్యే సరికి ఎకరాకు సగటున కనీసం రూ.15 వేలు ఖర్చు వచ్చింది. స్థానికంగా కూలీలు అసలు దొరకడం లేదు, వారంతా పత్తి తీతలకు వెళ్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలతోనే నాట్లు వేయించా. ఎకరాకు నాటుకు రూ.5 వేలు ముతాకు ఖర్చు అయింది. వలస కూలీలు లేకపోతే ఇక్కడ నాట్లు వేయడం కష్టం అవుతోంది. గతంలో యూరియా రూ.270కి దొరికింది, ఇప్పుడు రూ.450 అంటున్నారు. మిగతా ఎరువులు బాగానే దొరకుతున్నాయి.

– బొరిగొర్ల గురువులు, రైతు, కారెంపూడి

పెట్టుబడులకు అవస్థలు



మండలంలో సుమారు ఐదు వేల మంది వలస కూలీలు ఉన్నారు. ప్రస్తుతం వారే వరి నాట్లు వేస్తున్నారు. కూలీల కొరతతో పాటు యూరియా రేటు పెచ్చు పలకడంతో ఇబ్బంది పడుతున్నాం. చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులు కూడా పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నారు. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. పత్తి పంట వర్షాలకు దెబ్బతినడం వల్ల రైతులకు ఆర్థిక వెసులుబాటు తగ్గి ఈ పరిస్థితి వచ్చింది.

– ఓర్సు బ్రహ్మం, రైతు, ఒప్పిచర్ల

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఎస్‌ఈ పి. విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పిడుగురాళ్ల : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎస్‌ఈ పి. విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కొండమోడు విద్యుత్ కార్యాలయంలో మాచర్ల డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని కోరారు. రైతులకు త్వరితగతిన విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్తు బిల్లుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిని వివరణ కోరి, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తప్పనిసరిగా నూరు శాతం వసూళ్లు సాధించాలని ఆదేశించారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై గృహ వినియోగదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ సిబ్బంది అందరూ ఎప్పటికప్పుడు పనితీరు మెరుగు పరుచుకోవాలని ఆయన తెలిపారు. వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. గడువు పొడిగించిన 50 శాతం అదనపు లోడు సబ్సిడీ స్కీంను గృహ విద్యుత్ వినియోగదారులంతా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. 24 గంటల విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నందున, సరఫరాలో అంతరాయాలను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పిడుగురాళ్ల పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తితే ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ 6281702413కు ఫోన్ చేసి సేవలు పొందాలని తెలిపారు.సమావేశంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతలపాటి సింగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. నాగ సురేష్‌బాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సైదారావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కారెంపూడి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని కారెంపూడి మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నిర్వహించారు. సీజనల్ వ్యాధులను అరికట్టడం, అనసరపు నీటి నిల్వలను తొలగించడంపై గ్రామస్తులకు పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ప్రతి పౌరుని ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. పంచాయతీ పాలక వర్గాలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు కూడా పరిసరాల పరిశుభ్రత కోసం పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు, సీహెచ్‌ఓ మల్లయ్య, లాలూ నాయక్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం పోరాడాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీడీపీవో రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

పిడుగురాళ్ల: డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పోరాడాలని ఈగల్ టీం పోలీస్ కానిస్టేబుల్ సుభాని, ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేకంపై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత సిగిరెట్, మద్యానికి ఎక్కువగా బానిసవుతున్నారని, వాటి వల్ల వచ్చే అనర్థాలను తెలుసుకోవాలని సూచించారు. చుట్టుపక్కల నివసిస్తున్న వారికి, తల్లిదండ్రులకు వీటి వల్ల కలిగే అనర్థాలను వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసరావు, సీడీపీవో పి. రాజేశ్వరి, సూపర్‌వైజర్ నాగమణి, కె. కోటేశ్వరి, పి. అంజలి, ఏడబ్ల్యూడబ్ల్యూఎస్ ఏబీ సరస్వతి, జె. రామలక్ష్మి, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మాచవరంలో...

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగాల బారినపడి జీవితాలను పాడు చేసుకోవద్దని లింక్ వర్కర్స్ స్కీం జోనల్ సూపర్ వైజర్ ఎం. విశ్వేశ్వరరావు సూచించారు. మాచవరంలోని శ్రీ విజేత జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం సుమారు 100 గ్రామాల్లో పని చేస్తోందని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలియజేశారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపవద్దని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, లింక్ వర్కర్స్ స్కీం సిబ్బంది సాగర్, దీనకుమారి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



సత్తెనపల్లి: ప్రతి విద్యార్థిని హెచ్‌ఐవీ గురించి అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవీలత అన్నారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్, మత్తు పదార్థాల వినియోగ విరమణపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు ప్రతినిధులు నాగలక్ష్మి, జ్యోతి, ఈశ్వర్‌లు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహిస్తున్న 2 నెలల ఐఈసీ ప్రోగ్రాం గురించి వివరించారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ యాక్ట్ 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పీఈలు ప్రసన్న, విజయకుమారి, లక్ష్మిబాయి, నాగూర్, శాంతి కుమారి, సుజాత, పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల పరిరక్షణకే అట్రాసిటీ చట్టం



మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు

సత్తెనపల్లి: షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల వ్యక్తుల, ఆస్తులు, ప్రాణ, మాన పరిరక్షణకే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పని చేస్తుందని ప్యానల్ న్యాయవాది డి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్‌జడ్జి (సీనియర్‌డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ చట్టంపై ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు పట్టణంలోని మాస్టిన్ పేటలో జ్యోతి ఫౌండేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఉన్న హక్కులు, అన్యాయం జరిగితే ప్రత్యేక న్యాయస్థానం ఉన్న అంశాన్ని తెలియపరిచారు. మరో ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు ఉచిత న్యాయసహాయం గురించి తెలియజేశారు. ఈ ప్రత్యేక చట్టం వచ్చిన తర్వాత గతంలో ఉన్న వేధింపులు దాదాపు తగ్గాయన్నారు. పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రాజుపాలెం: మండలంలోని క్రైస్తవ సంఘ కాపరులు తోటి సంఘ సేవకురాలైన బి.అన్నమ్మకు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. కొండమోడు వీరమ్మ కాలనీలో గల కృపా ప్రార్థనా మందిరంలో బి.అన్నమ్మ సేవకురాలుగా పనిచేస్తుంది. శస్త్ర చికిత్స నిమిత్తం ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ నందమూరి క్రిష్టర్ చేతుల మీదుగా రూ.6500ల చెక్కును ఆమెకు అందజేశారు. సంఘ కాపరులు టి.రత్నం, సతీ షకుమార్, మండల పాస్టర్స్ ఫెలోషిప్ కన్వీనర్ జి.ఎస్.ఆర్.రెడ్డి పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

అమరావతి: అఖిలభారత సీపీఐ మాజీ కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు ఆధ్వర్యంలో పలువురు నేతలు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. సూరిబాబు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించి దోపిడీ లేని కార్మిక రాజ్యం స్థాపన కోసం విద్యార్థి దశనుంచే ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమాలు నడిపి అంచలంచెలుగా జాతీయ కార్యదర్శిస్థాయి వరకు ఎదిగిన కమ్యూనిష్టు దిగ్గజం సురవరం అని అన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి రాష్ట్ర కార్యదర్శిగా రెండుసార్లు, పార్లమెంటు సభ్యులుగా స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అనేక ఉన్నతమైన పదవులు చేస్తూ నిస్వార్థంగా, నిజాయితీగా ప్రజాసమస్యలపై పోరాటం సాగించిన గొప్ప కమ్యూనిస్టు నేత అన్నారు. వివిధ ప్రజాసంఘాల నేతలు సయ్యద్ మెహదీన్ వలి, ఎం.సుబ్రహ్మణ్యం, నండూరి వెంకటేశ్వరరాజు, ఎస్.రాజకుమార్ తదితరులు కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మృతికి సంతాపం తెలియచేశారు.

వికలాంగుల పింఛన్లు తొలగించడం సరికాదు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: వికలాంగుల పింఛన్లు తొలగించడం సరికాదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలకల్లు గ్రామానికి చెందిన ముద్దారెడ్డి శివారెడ్డికి గతంలో వికలాంగుల పెన్షన్ వస్తుండేదని, ఇటీవల అధికారులు వెరిఫికేషన్ చేసి నిలిపి వేశారని పేర్కొన్నారు. ఎడమ పాదం మొత్తం తీసేసి మంచానికే పరిమితమైన శివారెడ్డి పరిస్థితి బాగోలేదని, ఒళ్లు అంతా పుండ్లు పడ్డాయని ఆయన తెలిపారు. మంచానికే పరిమితమైన వ్యక్తి పింఛన్ ఆపుతున్నారంటే అంతకంటే దౌర్భాగ్యం ఇంకొకటి లేదన్నారు. శివారెడ్డి భార్య కూడా క్యాన్సర్‌తో బాధపడుతోందని తెలియజేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రీ వెరిఫికేషన్ చేసి, శివారెడ్డికి పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కాసును విమర్శించే స్థాయి నీది కాదు !

- టీడీపీ నాయకుడు జానీ బాషా వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దాచేపల్లి : అభివృద్ధి, సంక్షేమంలో గురజాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డిని విమర్శించే స్థాయి చికెన్ వ్యాపారి, టీడీపీ నాయకుడు జానీ బాషాకి లేదని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే కాసుపై టీడీపీ నేత జానీ బాషా చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. నారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాషా ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యాపారులను బెదిరించి, తప్పుడు కేసులు పెట్టించి తన కోళ్ల వ్యాపారాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరిస్తున్నాడని ఆరోపించారు. వద్ద కోళ్లు వేయించుకొని వ్యాపారులపై పోలీసుల ద్వారా బెదిరిస్తూ తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాసుపై బాషా వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ సైదా, నాయకులు షేక్ దాడీ, నరసింహారావు పాల్గొన్నారు.

బాషా పోలీసులతో బెదిరించి భయపెట్టాడు



వెంకటరెడ్డి

దాచేపల్లి : టీడీపీ నాయకుడు జానీ బాషా పోలీసులతో బెదిరించి భయపెట్టాడని చికెన్ వ్యాపారి వేంపటి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం వెంకటరెడ్డి మాట్లాడుతూ విడుదల చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో శనివారం హల్ చల్ చేసింది. గత 20 ఏళ్ల నుంచి తాను చికెన్ వ్యాపారం చేస్తున్నానని, ఎప్పుడు కూడా ఇతరులను ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను నారాయణపురంలో నిర్వహిస్తున్న షాపు వద్దకు టీడీపీ నాయకుడు షేక్ జానీబాషాతో పాటు ఆయన అనుచరులు వచ్చి తననను తీవ్రంగా బెదిరించారని తెలిపారు. తమ ప్రభుత్వంలో షాపు మూసి వేయకపోతే అంతు చూస్తామని బెదిరించాడని వెంకటరెడ్డి ఆ వీడియోలో ఆరోపించారు. తాను నిర్వహిస్తున్న చికెన్ షాప్ లో గంజాయి పెట్టి, జైలుకు పంపుతామని పోలీసుల ద్వారా బెదిరించాడని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి హయాంలో ఏ వ్యాపారి కూడా ఇబ్బంది పడలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలోనే చికెన్ వ్యాపారులందరినీ జానీ బాషా బెదిరించి తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, అతడి వల్ల తనకు ప్రాణహాని ఉందని వెంకటరెడ్డి ఆ వీడియోలో పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

రెంటచింతల: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని గురజాల సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) సంక్షేమ వసతి గృహంలో శనివారం లీగల్ సర్వీసెస్ కమిటీ గురజాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేసుల్లో బాధితులకు ఎలా న్యాయం జరుగుతుందో వివరించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు వివరాలు, చట్టంలోని ముఖ్యాంశాలపై న్యాయ అవగాహన కల్పించారు. విద్య అందించే విజ్ఞానంతో బంగారు భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు మరవకూడదని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వై. మోహన్, ఎస్‌ఐ సీహెచ్. నాగార్జున, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కె. చలమరాజు, న్యాయవాదులు జానీ బాషా, జ్ఞానసుందరి, కలివేలు ప్రభుదాస్, ఝాన్సీ, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న అధికారులకు సన్మానం



మాచర్లలో అధికారులకు సన్మానం



ఆర్డీవోను సత్కరిస్తున్న కార్యాలయం సిబ్బంది

మాచర్ల రూరల్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ అత్యవసర, విపత్కర పరిస్థితుల్లో నిరంతరం సేవలందించే ఉద్యోగులు అవార్డులను అందుకోవడం అభినందనీయమని రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు షేక్ పాషావలి అన్నారు. ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డులందుకున్న తహసీల్దార్ బందెల కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు, ఆర్‌ఐ అనిల్ కుమార్, ఉపాధ్యాయురాలు సాంబేలు శాంతి బాయి, ఏఈ మరియదాసు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అలీలను సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు, షేక్ పాషావలి మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో నిక్కచ్చిగా పనిచేస్తూ, ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉంటూ సమర్థంగా విధులను నిర్వహించే తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు అవార్డు రావడం అభినందనీయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తే అవార్డులు వెతుక్కుంటూ వస్తాయనటానికి వీరే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాచర్ల వాసు, ఆంజనేయులు, వైద్యులు కమలహాసన్, దాక్షాయణి, పెన్షనర్లు రామనాథశర్మ, చంద్రయ్య, ఏజీపీ గంగుల శ్రీనివాసరావు, లాయర్ జీవి, బృంగా రమణ, బాదన్‌బాయి పాల్గొన్నారు.

ఆర్డీవో మురళీకృష్ణకు సన్మానం

గురజాల : రెవెన్యూ డివిజనల్ అధికారి వి. మురళీకృష్ణను సిబ్బంది శనివారం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఆగస్టు 15న ఆయన ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సుజాత, ఎన్జీవో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సూరేపల్లి రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలోని ఎంపీపీ మెయిన్ పాఠశాలలో శనివారం స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, ఎంఈఓలు జి.కృష్ణ, ఎం.గణేష్ పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మొక్కలు నాటటం వలన మంచి వాతావరణంలో విద్యాబోధన జరుగుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా పాఠశాలలను దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటి వాటి, రక్షణ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాఘవ, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్‌కే హుస్సేన్, క్లస్టర్ చైర్మన్ యోగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆరిఫ్, ఫైయాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.